బొమ్మకావాలని మారాం చేసిన చిన్నారికూతురి కోరిక ఆ తల్లి తీర్చిందా?


# బొమ్మ

అచ్యుతుని రాజ్యశ్రీ కథ

"అమ్మా! నాకు మంచి పాప బొమ్మ కావాలే" నాలుగేళ్ల దీప్తి తల్లి కొంగుపట్టుకుని ఏడుస్తూ గుణుస్తోంది. ప్రక్కింటి వాళ్లమ్మాయికి అందమైన బొమ్మ వుంది. అది ఎంచక్కా గుండ్రంగా కళ్లుతిప్పుతూ చక్రాల్లా వున్న కళ్లతో, వత్తినప్పుడల్లా "మమ్మీ" అంటూ సన్నగా అరవడం, పట్టుకుచ్చులాంటి జుట్టు, బంగారు రంగు కుచ్చుల ఫ్రాకుతో వున్న ఆ బొమ్మ పెద్దాళ్లనికూడా ఆకర్షిస్తోంది. ఇంక చిన్న పిల్ల దీప్తిని ఆకర్షించడంలో ఆశ్చర్యమేముంది?

మనసంతా చిరాగ్గా ఉన్న లక్ష్మికి ఒకేసారి ఏడుపు, కోపం ముంచుకొచ్చాయి. "ఎన్నిసార్లు చెప్పాలే నీకు? ప్రస్తుతం డబ్బుల్లేవు" అంటూ ఒక్కటి చరిచింది దీప్తి వీపుపై. దీప్తి ఏడుపు లంకించుకుంది. "ప్రొద్దున్నే ఏడుపు మొత్తుకోళ్లు... శని పీనుగలు" పాడుకొంప" అని తిట్టుకుంటూ ఎర్రబడ్డ కళ్లతో కోపంగా భార్య కూతురువంక చూస్తూ, జుట్టు ఎగరేస్తూ "కాఫీ కాచావా?" అని అరిచాడు. పాచి మొహంతో మత్తుగా జోగుతున్న భర్తని చూస్తే అసహ్యం, ఉక్రోషం కలిగాయి లక్ష్మికి. "ఊ..." అంటూ కప్పు అందించింది.

"నీ బొందలా వుంది. నీళ్లొచ్చాయి. ఈ పీడా ఎప్పుడు విరగడ అవుతుందో?" పెద్దగా రంకెలేస్తూ కప్పు నేలకేసి కొట్టి బాత్రూంలోకి దూరాడు సీతారాం. తల్లిదండ్రుల మొహాలు చూస్తూ వారి అరుపులు వింటూ బిక్కచచ్చిన దీప్తి తాత్కాలికంగా తన ఏడుపును ఆపి ఓ మూల ఒదిగింది. భర్తకి అన్నీ అమర్చి అతను ఆఫీసుకెళ్లిన



తర్వాత దీప్తికోసం వెతికింది. నులకమంచం క్రింద చెక్కబొమ్మని పొట్టకానించుకుని నిద్రపోతోంది ఆ పసిది! ఒక్కసారి ఏడ్పు ముంచుకొచ్చి కదుపు తరుక్కుపోయింది లక్ష్మికి.

ఆడుకోటానికి బొమ్మ కావాలి దానికి. మనిషే ఓ బొమ్మని ఆ పసిదానికింకా తెలీదు. ''దీప్తీ'' అంటూ లేపి స్నానం

చేయించి అన్నం పెట్టి తనూ కంచంముందు కూచుందిగానీ ముద్ద మింగుడు పడడం లేదు. పసిదాన్ని పొద్దున్నే చావబాదింది. ప్రక్కింటమ్మాయి పాప బొమ్మ కొనాలంటే ఎంతలేదన్నా ఓ రెండొందలు తక్కువుండదు. తన చేతిలో పట్టుమని పది రూపాయలు లేవు. ఇంట్లో సరుకులు నిండుకున్నాయికూడా. నెలాఖరుకి ఇంకా పదిరోజులుంది. పసిదానికి సరైన తిండే పెట్టలేని తను బొమ్మనెక్కడ్నుంచి కొనివ్వగలదు? చిన్నారి దీప్తికేం తెల్సు. తన తల్లే ఒక మరబొమ్మని!

"అమ్మా దీప్తీ! నీ తల్లి విధి చేతిలో కీలుబొమ్మ. నీ తండ్రికి ప్రాణం ఉన్న కోరికలుతీర్చే బొమ్మ. నా ప్రేమను తప్ప ఏమీ నీకివ్వలేని ఈ తల్లే నీకు బొమ్మ అమ్మా!" అని బావురుమని ఏడ్చింది.

హు... తనదెలాంటి నికృష్టపు బ్రతుకు! చిన్నప్పుడు తల్లి ప్రేమ ఎరగదు. తండ్రి పశుకామప్రవృత్తికి బలైన తల్లి పదకొండో కాన్పులో శాశ్వతంగా కన్నుమూసింది. ముగ్గురాడపిల్లలు మిగిలారు తండ్రికి. ఏటా మాలింత బాలింతలా వుండే భార్యపై చిరుబురులాడుతుండే తండ్రంటే లక్ష్మికి చిన్నప్పట్నుంచీ ఓ విధమైన భయం, జంకు కూడాను. ఏనాడూ తండ్రి తనని దగ్గరకు తీసుకున్న పాపాన పోలేదు.

"ఛీ శనిముండా! ఆడతద్దినం. బక్కపీను..." అని చీటికి మాటికీ లక్ష్మిని చావబాదేవాడు. తన అవివేకపు పనులు, తలబిరుసు మాటల్తో ఉద్యోగం పోగొట్టుకున్న తండ్రి — దానికి కారణం నెలఅయినా నిండని పసిగుడ్డు లక్ష్మి అని అకారణంగా తిడ్తే తల్లి కళ్లొత్తుకునేది. "ఇది లక్ష్మికాదు, జేష్ఠముండ" అని సాధించి భర్తని నిస్సహాయంగా చూసేది. లక్ష్మికి ఐదేళ్ల వయసప్పుడు తల్లికి మూడు అబార్షన్స్ అవడం చివరగా ప్రసవ టైంలో తల్లి పుట్టిన పిల్లాడు పోవడంతో, ఇరుగుపొరుగుల సాయంతో అక్కల పెంపకంలో పన్నెండేళ్ల లక్ష్మి ఎన్నో చేదు అనుభవాల్ని రుచిచూసింది. పెద్దక్క కూడా ప్రసవ సమయంలో మరణించడంతో అమ్మ తర్వాత అమ్మలా ఆదుకున్న ఆమెను మరవలేకపోయింది చిన్నారి లక్ష్మి. భర్త మరణించడంతో తలచెడి పుట్టింటికి చేరింది రెండో అక్క పదహారేళ్ల సీత! కుంకంలేని నుదురు, పాలిపోయిన బక్క శరీరంతో దిగులుగా వుండే సీత అంటే లక్ష్మికి ప్రాణం, అభిమానం!

పాపం సీతకూడా భర్తతో ఏమీ సుఖపడలేదు. తనకి "సైకిలు కావాలి, రేడియో కావాలి... మీ నాన్ననడిగి తీసుకురా" అని ప్రొద్దుగూకులూ సాధించి తన్ని తగలేసేవాడు ఆమె భర్త రావుడు. అప్పుడప్పుడూ దెబ్బలు వాతలుకూడా తేలేవి సీత ఒంటిపై. "బావ మంచాడు కాదు. అందుకే దేవుడు చంపేశాడు" అని కసిగా ఆనందించేది లక్ష్మి.

పదిహేడో సంవత్సరంలో అడుగెట్టిన లక్ష్మి టెన్త్ పాసైంది. తండ్రి ఎలాగైనా ఈమెని వదిలించుకోవాలని చూస్తున్నాడు కానీ పెళ్లంటే మాటలా మరి? వయసులో చిన్నదైన సీత ఎంతో ఆరిందాలా ఇంటి బాధ్యత తీసుకుని, తను కుట్టుపనిచేసి, ఆ

వచ్చినదాన్తో గుట్టుగా చెల్లికి, తండ్రికి ఇంత ఉడకేసి పెడ్తోంది. బారైన వెండ్రుకల్తో, కనుముక్కు తీరుతోవుండే సీత ఆ వీధిలో వారందరినీ అందరాని చందమామలా ఊరిస్తోంది.

ఎక్కడో సేల్స్‌గర్ల్ ఉద్యోగం ఉందని వెళ్లిన లక్ష్మి ఇంటికొచ్చేటప్పటికి రాత్రి ఏడు దాటింది. ఇంట్లో నాన్న లేడు.

''అక్కా!'' అంటూ పిలవబోయిన ఆమె హఠాత్తుగా ఆగింది. వంటింట్లో ఎవరిదో మగ కంఠం. సీత వెక్కుతూ ఏడుస్తూ ఏదో అంటోంది.

మొరటుగా ''చెప్పిన మాట వినవా? ఇప్పుడు నీకెవరు దిక్కు? అయినా ముండ మోపి మూల కూచోడం ఎందుకు? నా దగ్గరికి రా. నీ అక్క మొగుడ్నేగా?'' అంటూ సీత రెక్క పట్టుకుని బలంగా తనవైపు గుంజుతున్నాడు యాభై పైనే వయసుండి నల్లగా మొరటు విగ్రహం గుబురుమీసాల్తో వున్న వ్యక్తి.

''అక్కా!'' అన్న లక్ష్మి పిలుపుకి త్రుళ్లిపడి సీతని వదిలాడు.


''ఓహో! నీవా చిట్టి మరదలా! నేను జ్ఞాపకం వున్నానా? నీ పెద్దక్క మొగుడ్ని! అబ్బో బానే రంగుతేలి పిటపిటలాడ్తున్నావే? మీ అక్క పోయినపుడు ఇంత గుంట. ఏం అలా చూస్తావ్? నేను మీ పెద్దబావ రాయుడ్ని. కొన్నాళ్లు మాదగ్గరే పెరిగావుగా మీ అమ్మ పోయిన తర్వాత. నీకున్నదిప్పుడు నేనొక్కడ్నే బావని. రెండో ఆయన స్వర్గాని కెళ్లాడుగా?'' అంటూ బడబడా వాగుతూ దగ్గరకొచ్చాడు.

''బావా!'' అంది అప్రయత్నంగా.

''అవును మరదలా! జ్ఞాపకం వచ్చావా? మీ నాన్న కబురెట్టాడు నీకు సంబంధాలు చూడమని''.

భుజంమీద వేయ్యేసిన అతడ్ని విసురుగా తోసింది లక్ష్మి. తన తాతంత వయసున్న బావకి తమా అక్క కామదాహాన్ని తీర్చే బొమ్మల్లా కన్పడ్తున్నారు. దాదాపు ఇరవై పైన వయసు

## దేవుడి పేర్లొద్దు!



బొంబాయి నగరానికి చెందిన భారతీయ జనతాపార్టీ... ఆ నగర ప్రొహిబిషన్ కమిషనర్‌ను బెదిరిస్తూ ఈ మధ్యన ఓ ఉత్తరం వ్రాసిందట! ఇకనుంచి బొంబాయిలో ఏ బార్‌కూ... దేవుడి పేరు పెట్టనివ్వకూడదనేది ఆ లేఖ సారాంశం! ఒకవేళ అలా జరిగితే పెద్ద 'యాజిటేషన్' మొదలు పెడ్తారనికూడా వారు బెదిరిస్తున్నారట! కావాలంటే పువ్వులు, ఫలాలు, [illegible] పేర్లూ — ఇంకా కావాలంటే కాంగ్రెస్ నాయకుల పేర్లూ పెట్టుకోమని సలహా ఇచ్చిందట ఆ పార్టీ! సో — పేర్ల మార్పుతో... కనీసం ఆర్టిస్టులైనా బాగుపడ్తారన్నమాట!

— జూపిటర్

తేడా వున్నా ఈ రెండో పెళ్ళివాడికి పెద్ద కూతుర్ని అంటకట్టి వదిలించుకున్నాడు తండ్రి. వీడికి లక్ష్మి కావాల్సి వచ్చిందా? అని ఆలోచిస్తున్న లక్ష్మి "ఏం లక్ష్మమ్మా! సీత కన్నా నీవింకా దోరగా చిలకకొట్టిన పండులా ఊరిస్తున్నావ్. దానికి కొంతన్నా సంసార సుఖ అనుభవం వుంది. వేరే పై సంబంధం ఎందుకు? నేనే పెళ్లాడ్తా. ఒంటినిండా నగలు, రంగురంగుల కోకలు..." అంటూ ఆమె నడుంమీద చెయ్యేశాడు. ఇంతలో ఎక్కడ్నుంచి వచ్చిందో భద్రకాళిలా సీత చేతిలో కర్రతో అతనివీపుమీద వడ్డించింది.

"అమ్మో!" అంటూ నడుం పట్టుకున్నాడు. ఈ లోపల తండ్రి రావడం, రుసరుసలాడ్తున్న రాయుణ్ని బుజ్జగించి, ఆడకూతుళ్లని తిట్లవర్షంతో దీవించడం జరిగిపోయింది.

మామ బ్రతిమాలడంతో ఆ రాత్రి అక్కడే భోజనం చేసి గుర్రుకొట్టి నిద్రపోయాడు రాయుడు. లక్ష్మిని అతడికిచ్చి చేయడానికి నిర్ణయమైపోయింది. విషయం తెల్సిన అక్కాచెల్లెళ్లు గుండెలు బాదుకున్నారు. ఇద్దరికీ కంటిమీద కునుకులేదు. తండ్రంటే ద్వేషం, కోపమే కాకుండా కసి పెరిగి చంపేయాలన్నంత కోపం వచ్చింది లక్ష్మికి. శ్రావణంలో ముహూర్తం పెట్టమని మామకి చెప్పి ఓ వంద రూపాయల నోటిచ్చి వెళ్లాడు రాయుడు. బ్రాందీతో ఖుషీ చేస్కోడానికి బైటికెళ్తున్న తండ్రిని చూస్తూ బొమ్మలా వుండిపోయారా అక్కాచెల్లెళ్లు!

పెళ్ళికింకా రెండు నెల్ల పైముంది. తన కాళ్లపై తను నిలబడి, తండ్రినెదిర్చి ఈ పెళ్లిచేసుకోరాదని నిర్ణయానికొచ్చింది లక్ష్మి.

ప్రక్కింటి పరంధామయ్యగారి పుణ్యమా అని ఓ బట్టల కొట్లో సేల్స్ గర్ల్ ఉద్యోగం దొరికింది లక్ష్మికి. యాభై దాటిన పరంధామయ్యగార్కి భార్య పార్వతమ్మ పోయి మూడు నెలలైంది. పిల్లాజల్లా లేరు. ఆమె బ్రతికున్నప్పుడు "పాపం తల్లిలేని పిల్లలు! తండ్రి దుష్టుడు, ఏమీ పట్టించుకోడు" అని సీత, లక్ష్మిని చేరదీసేది. ఆమెను "పిన్నిగారూ!" అని పిల్చేవారు. సీత అప్పుడప్పుడూ ఆయనింటికెళ్లి వంట పనిలో సాయపడేది. భార్య పోవడంతో పూర్తిగా ఆ అమ్మాయిమీదే ఆధారపడ్డాడాయన. కావల్సిన డబ్బు, కూరానారా తెచ్చిపడేసే ఆయన తండ్రికన్నా ఎక్కువని పూజ్యభావంతో చూసేవారా అక్కాచెల్లెళ్లు.

ఉద్యోగం దొరికిన లక్ష్మి — సీత అదోలా దిగులుగా వుండడం, తనతో ఏదో చెప్పాలని ప్రయత్నించి ఎవరో నోరునొక్కినట్లు ఆగిపోవడం అంతగా గమనించలేదు. పెద్దగా అక్కని గూర్చి పట్టించుకోకుండా తాను బట్టలషాపులో చేసే పని, వచ్చే వ్యక్తుల గురించి వర్ణించేది. చెల్లి మొహంలో కదలాడే సంతోషం, సంతృప్తి చూసిన లక్ష్మి పెదవి విప్పి తన బాధలు చెప్పేదికాదు. "అక్కా మా షాపులో రెండు ఆడ బొమ్మలున్నాయి. రెండ్రోజులకోసారి వాటికి భలే భలే చీరలు, రకరకాల స్టైల్లో మార్చి కడ్తాం తెలుసా? మరి నాపనేంటో తెల్సా అక్కా!...."


"అలా ప్రొద్దుగూకులూ సేల్ షాపులో వున్నంతసేపూ నిల్చుని ఈ చీరె, ఆ చీరె

సవరిస్తూ, వాటిని మడతలు పెడ్తూ ఇక్కడవి అక్కడా, అక్కడివి ఇక్కడా మార్చడమే.. .. వాతోపాటింకా ఇద్దరమ్మాయిలున్నారు. అక్కా! ఇవ్వాళేమైందో తెల్సా? మా సేఠ్ కొడుకొచ్చాడు. అబ్బ సినిమా హీరోలా వున్నాడు. తెల్లటి పడవలాంటి కారులో, దంతం బొమ్మల్లాంటి భార్యతో వచ్చాడు. వాళ్ల పాప బొద్దుగా, ముద్దుగా రబ్బరు బొమ్మలా వుందక్కా! వాళ్లావిడ ఏవేవో చీరలు చూస్తూ మిగతావారితో మాట్లాడ్తుంటే, ఆయన సరాసరి నా దగ్గరకొచ్చి నాతో ఓ ఐదునిమిషాలు మాట్లాడాడు..." అని ఓరోజు చెప్పింది.

ఇంకో వారం తర్వాత చేతిలో పాకెట్‌తో ఉషారుగా వచ్చిన చెల్లిని వింతగా చూసింది సీత! "అక్కా! ఆ రోహిత్ అదే మా సేఠ్ కొడుకు ఇవ్వాళ నాతో చాలాసేపు మాట్లాడాడు. నన్ను కారులో హోటల్‌కి తీసుకెళ్లాడు. స్వీట్, ఖారా తినిపించాడు. మరే ఈ చీర నాకు బోనస్‌గా ఇచ్చాడక్కా!..." సీత కళ్లల్లో ఏదో మూగబాధ. చెల్లికి ఎలా ఏం చెప్పాలో అర్థంగాక అలా చూస్తుండిపోయింది. "లక్ష్మీ! చిన్నపిల్లవు. జాగ్రత్తగా వుండాలి ముఖ్యంగా మగాళ్లతో. ఈ సమాజం ఒక ఊబిలాంటిది. పొరపాటున ఆడది కాలుజారిందా ఇక అంతే. ఆమె జీవితం కుక్కలు చింపిన విస్తరవుతుంది. అర్థం చేసుకో. త్వరగా ఎవర్నీ అందులో మగాళ్లని నమ్మకు. ఈ రోజుల్లో సోదరుల్ని, తండ్రుల్ని నమ్మలేని స్థితిలో ఉంది మన సమాజం..."

"ఫో అక్కా! నీవెప్పుడూ నిరాశావాదివే. నీ కర్మకొద్దీ నీకలాంటి భర్త దొరకడంతో మగాళ్లంతా అంతే అనే స్థితిలోకి వచ్చావు"

"కాదమ్మా!" అని ఏదో చెప్పబోయిన అక్కని వారించి, తూనీగలా గదిలోకెళ్లి ఆ చీర కట్టుకుని వచ్చింది. బంగారు రంగులో అక్కడక్కడా చెమ్కీ బుటాతో మెరుస్తున్న ఆ చీరెతో తల్లో పచ్చ చేమంతుల్తో ఎంత కళగా విందుగా వుంది లక్ష్మి. ఆమె ఆనందాన్ని చూస్తూ ఇంకేమీ మాట్లాడలేక



పోయింది లక్ష్మి.

ఆరోజు అర్ధరాత్రి ఎందుకో హఠాత్తుగా మెలకువ వచ్చింది లక్ష్మికి. ఏదో భయంకరమైన కల! అక్క ఎక్కడికో అగాధంలోకి దూకినట్లు, అంతలోనే ఏదో ఊబిలో దిగబడి గిజగిజ కొట్టుకుంటున్నట్లు... అక్కని ఎంతోమంది పురుషులు తరుముతున్నట్లు, రాళ్లతో కొడ్తున్నట్లు... ఇష్టం వచ్చినట్టు చిల్లరడబ్బులు ఆమెమీద విసురుతున్నట్టు... భయంతో ఒళ్లంతా చెమటపట్టింది లక్ష్మికి. నాలుక పిడచకట్టుకుపోతోంది. లేచి మంచినీళ్లు త్రాగుదామని వంటింటివైపు అడుగేసింది. ప్రక్కగదిలోంచి సన్నగా మాటలు అక్క మూలుగు వినిపడుతున్నాయి. కిటికీలోంచి తొంగిచూసిన లక్ష్మి నిర్ఘాంతపోయింది.

వెన్నెల బాగా ప్రసరిస్తున్న ఆ గదిలో మంచంపై పూర్తి దిగంబరత్వంతో అక్క, ఆమెపై ముసలి పరంధామయ్యా! ఆమె శరీరాన్ని పూర్తిగా ఆక్రమించి గుబురుమీసాల్తో సీత మొహాన్ని బలంగా అదుముతున్నాడు. "బాబాయ్! అక్కా" అని గట్టిగా అరవబోయింది. కానీ నోట మాట పెగలందే! పిచ్చిదానిలా తండ్రి మంచం దగ్గరికి పరుగెత్తింది. గుప్పుగుప్పున చుట్ట పొగ వదుల్తూ చేతిలో రూపాయి నోట్లను లెక్కపెడ్తున్నాడు. బైట ఎవరో ఇంకో ఇద్దరు పురుషులు అటు తిరిగి మాట్లాడుకుంటున్నారు. అలికిడికి ఇటు తిరిగిన తండ్రి వెంటనే లక్ష్మిని బరబరా పట్టి ఈడుస్తూ గదిలోకి లాక్కుపోయాడు. "నీవు బైటికి రావద్దు" అని శాసిస్తూ తలుపు లాగి వెళ్లిపోయాడు. భయం, అసహ్యం, కోపం, జుగుప్సతో లక్ష్మి అణువణువునా కంపించిపోతోంది.

"ఏంటీ? నాన్నకి తెలుసా? నాన్నే డబ్బుకోసం అక్కని అమ్ముతున్నాడా? అక్క అంగడిబొమ్మ అయిందా? రేపు తనగతికూడా ఇంతేనా? ఇంకో ఇరవై రోజుల్లో బావతో తన పెళ్లి! ఇలాగే తననీ తారుస్తాడేమో? షోకేసులో బొమ్మే నయమేమో? దానికి ప్రాణంలేదు. నిండుగా బట్టలు కట్టుకుని కేవలం అందర్నీ ఆకర్షిస్తుంది. శీలాన్ని కోల్పోదు. కనీసం ఆ బొమ్మకున్న మానం మర్యాద నేటి ఆడదానికి లేదా? కన్నతండ్రే డబ్బుకోసం గడ్డితింటున్నాడా? బాబాయిలా ఆరాధించిన పెద్దమనిషే, భార్య చనిపోగానే కూతురులాంటి అమ్మాయిని కామించి అనుభవిస్తున్నాడా? అక్క అసలెలా ఒప్పుకుంది? అందుకా తమకి ఇంట్లో కాస్త జరుగుబాటు, కూరానారా తిండిలోకి అమర్తూ బాగుంది? తన ఉద్యోగం ప్రతిభేమో అనుకుంది. తలాతోకా లేని ఆలోచనల్తో మనసంతా గంద్రగోళం... శరీరం ఆవిర్లు చిమ్ముతోంది ఆవేశంతో భయంతో అసహ్యంతో!

ఎవరివో అడుగుల చప్పుడు. హఠాత్తుగా లేచి తనగదిలోపలి గడియేసి దుప్పటి ఒంటినిండా కప్పుకుని పడుకుందికానీ న్రిద రాందే? తెల్లారి లేచిన ఆమెకి అక్కమొహం చూడబుద్ధికాలేదు. ఇంకా సీత లేచినట్లు లేదు. తన పని ముగించుకుని షాపుకెళ్లిపోయింది త్వరగా. షాపింకా తెరవలేదు. బైటే కూచున్న ఆమెని "అరే లక్ష్మీ! అప్పుడే వచ్చేశారేం?" అంటూ పలకరించాడు సీతా

రాం. తెల్లని దుస్తుల్లో, నొక్కుల క్రాఫ్‌తో బలంగా ఎత్తుగా చామనఛాయతో వుండే సీతారాం ఆమెతో పాటే ఆ షాపులో ఎకౌంట్స్ చూస్తుంటాడు. తీక్షణమైన కళ్లు సీరియస్ మొహం అయినా ఎందుకో లక్ష్మిని బలంగా ఆకర్షిస్తాడు.

"రండి రండి. ఇక్కడే మా ఇల్లు. కాస్త కాఫీ త్రాగి వద్దాం" అంటూ బలవంతంగా లాక్కెళ్లాడు. ఒక్కటే గది అయినా హాయిగా అనిపించింది లక్ష్మికి. మండుటెండలోని వ్యక్తికి చల్లని నీడ దొరికినట్లుంది. సీతారాం తల్లి కనకమ్మగారు పెద్దావిడ. ఆప్యాయంగా పలకరించి టిఫిన్, కాఫీ ఇచ్చిందామె. తనకొక్కడే కొడుకని, వాడి పెళ్లిచేస్తే తన భారం తీరుతుందని, ఉద్యోగం చేసే పిల్లకోసం వెతుకుతున్నానని చెప్తూ లక్ష్మి వివరాలడిగింది.

తల్లి ప్రేమ కరువైన లక్ష్మికి ఆమె మాటలు పన్నీటిజల్లులా వున్నాయి. "ఇలాంటి అమ్మ నాకూ వుంటే? కనీసం ఇంత మంచి అత్తగారు దొరికితే? అలా సీతారాం, లక్ష్మిల మధ్య స్నేహం వర్ధిల్లసాగింది. ఆరోజు జీతం అందుకోగానే కనకమ్మగార్కి పళ్లు, స్వీట్సు కొని అందించింది. ఆవిడ సంతోషం చెప్పనలవికాదు. ఆ రోజు లక్ష్మి ఇంటికొచ్చేటప్పటికి జనం ఇంటిముందు మూగి వున్నారు. సీత వరండాలో ఓ మూల కూచుంది తలొంచుకుని. మధ్యగా తండ్రి శవం. "పాపం ఇద్దరూ ఆడకూతుళ్లు! దిక్కులేని పక్షులైనారు... చిన్నామె పెళ్లి చేయకుండానే చచ్చాడు ముసలాడు. అయినా ఏం పట్టించుకున్నాడులే? భార్యని రాచిరంపాన పెట్టాడు. పిల్లని రోజుకొకడికి తార్చే త్రాష్టుడు..." అలా రకరకాల వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి. లక్ష్మి మనసు స్తబ్దంగా బరువుగా వుంది. ఏడ్పు రావడంలేదు. అక్కవంక చూసింది. ఆమె తడిలేని గాజుకళ్లతో ఎటో చూస్తోంది. ఆరోజు ఆ సంఘటన చూసినప్పట్నించి అక్కతో మాట్లాడడం, ఆమె మొహం

## దీపం



"మా ఆవిడ ఈ మధ్య కొత్తగా చదువు నేర్చుకొంది. అందుకని రాత్రిళ్లు దీపం వెలిగించడం లేదు"

"ఏవేం??"

"ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు కదా మరి..!!"

"...??"

—రాఘవేంద్ర (మాచవరం)

చూడడమే మానేసింది. ముభావంగా ఇంటి కొచ్చి తన గదిలో పడుకునేది. సీతకూడా ఆమె కంట పడేదికాదు. పరంధామయ్య పురమాయింపుల్తో తండ్రి శవం లేచింది. అంతా శూన్యం. ఇన్నాళ్లూ ఆ ఇంటికి పేరుకన్నా ఓ మగదిక్కుండేది. ఇప్పుడు తండ్రిని కోల్పోయిన ఆడపక్షులు. మిఠాయి వుండల్లా అందరి నోరూరిస్తూ మిగిలారు. సీతారాం, కనకమ్మ వచ్చి పలకరించి, ఊరడించి వెళ్లారు. బావ రాయుడికి ఈ విషయం తెలపలేదు. ఎలాగైనా అతడ్ని చేసుకోరాదని నిర్ణయించుకుంది లక్ష్మి. ముభావంగా జీవచ్ఛవాల్లా ఒకర్ని తప్పించుకుని ఇంకోరు తిరుగుతున్నారు. పెచ్చులూడి కప్పుఅంతా చిల్లిపడ్డకొంపే తమకి ఆధారం.

తలంతా నెప్పి, నోరంతా చేదుగా వుంది లక్ష్మికి. రోహిత్ వచ్చి పలకరించినా పరధ్యానంగా సమాధానమిచ్చి ఇంటికెళ్లింది పర్మిషన్ తీసుకుని. గదిలో మంచంపై అతిసన్నిహితంగా కూచున్న సీతతో మాట్లాడుతున్న పరంధామయ్యని విసుగ్గా కోపంతో చూసి "అక్కా! కాఫీ" అని కేకపెట్టింది. "ఏం లక్ష్మి! త్వరగా వచ్చేశావేం? వంట్లో బాగాలేదా?"అంటూ తలపై చేయేసిన అక్కని తోసేస్తూ "ఎందుకొచ్చాడా ముసలిపీనుగ? ఇదేం సానికొంపనుకున్నాడా?"అంటూ హిస్టీరియాపేషంట్‌లా అరవసాగింది. తేలుకుట్టిన దొంగలా కిక్కురుమనలేదా ముసలాడు.

వెచ్చటి సూర్యకిరణాలు మొహంపై పడ్తుంటే బద్ధకంగా కళ్లుతెరిచిన లక్ష్మి "అక్కా!" అంటూ కేకపెట్టింది. ఎక్కడా అలికిడి లేదు. అనుమానం వచ్చి అన్నిగదులూ వెతికింది. కాఫీ గిన్నెకింద ఏదో కాగితం మడత! "చెల్లీ లక్ష్మీ! నేను సీతను శాశ్వతంగా ఈలోకంలోంచి నిష్క్రమించడానికి వెళ్లిపోతున్నాను. నావల్ల నీ జీవితమింకా నవ్వులపాలు కావడం నాకిష్టంలేదు. చెల్లీ! నా జీవితం మట్టిలో మిఠాయివుండలా అయింది. అయినా దులుపుకుని ఇంకా నన్ను నమిలి తినేయాలనే చూస్తోంది ఈ సమాజం! భర్త త్రాష్టుడైనా కనీసం ఒకఅండ, రక్షణ వుండేవి. విధవనైన నేను ఎంతో పవిత్రంగా బతుకుదామనుకున్నాకానీ కంచే చేనుమేసిన చందాన కన్నతండ్రే నా పాలిటి విషపు పురుగైనాడు. బాబాయిగా భావించిన పరంధామయ్య చేతిలో కీలుబొమ్మనైనాను. ఒక్కసారి పతనమైన నేను అందరి కళ్లకీ విందునయ్యాను. ఫలితం రాత్రిళ్లు నా శరీరాన్ని అమ్ముకున్నాను. అందుకే నాన్న నన్ను ప్రేమగా చూసేవాడు. నీవెలాగూ తలబిరుసుదానివి, మాట వినవని తెలుసు. దానికితోడు చదువుకుని, ఉద్యోగం చేస్తున్న నిన్నెవరైనా చేసుకుంటారు. నేను అలా కాదుగా మరి! నేనెంత జాగ్రత్తపడ్డా నా రొచ్చు జీవితం నీకంట పడనేపడింది. నీకు నాపై కోపం, అసహ్యం, జుగుప్స! నీపై ఈగవాలనీయకూడదని నా ప్రాణాలొడ్డి అయినా కాపాడాలనే నేను బతికాను. దుర్మార్గుడు ఆ పరంధామయ్య ఈ రాత్రి నిన్ను కాటేయాలని చూస్తే చేతి కందిన బండతో వాడి ఒళ్లు హూనం చేసి ఇంట్లో పారేసి వచ్చాను. చెల్లీ! సీతారాం, కనకమ్మగారు నిన్ను అభిమానిస్తున్నారు. నీవు వళ్లు తెలీకుండా మూర్ఛోజులబట్టి జ్వరంతో పడుంటే వారే వచ్చి నాకు సాయం చేశారు. నీకు పూర్తి కులాసా ఇచ్చింది. నా పాపిష్టి మొహం నీకు

చూపకూడదని, నా శాపగ్రస్త జీవితం నీకు విషవలయంగా మారకూడదని శాశ్వతంగా ఈ లోకంలోంచే తప్పుకుంటున్నాను. కనకమ్మగారికి నిన్ను అప్పగించాను. ఈ ఇంట్లో మీ దంపతులుండండి. ఆమె చల్లని తల్లి. కలకాలం సుఖంగా సుమంగళివై వర్ధిల్లాలని ఆశిస్తూ నీ అక్క..." చేతిలో ఉత్తరం జారిపోయింది. నేలపైఒరిగిపోయింది లక్ష్మి.

తిరిగి కళ్లెత్తి చూసేసరికి కనకమ్మగారి ఒడిలో వుంది. చేతిలో బత్తాయి రసాన్ని నెమ్మదిగా తాగించాడు సీతారాం! వుండడానికి స్వంత ఇల్లు, ఉద్యోగం వున్న కోడలు దొరికినందుకు మురిసిపోయింది కనకమ్మగారు. ఆమె బతికున్న రెండేళ్లు అపురూపంగానే చూసుకున్నాడు సీతారాం లక్ష్మిని. దీప్తి పుట్టడం, తల్లి పోవడం, మశూచి వచ్చి లక్ష్మి రూపురేఖలు మారిపోవడంతో అతనిలోని దానవుడు విజృంభించాడు. "శని... ఆడపిల్ల... నా తల్లిని మింగింది" అని చీటికి మాటికి దీప్తిని కసిరి బాదేవాడు. అడ్డంవచ్చే లక్ష్మికీ దెబ్బలే! సుస్తీపడి, అందం కోల్పోయిన లక్ష్మిని పనిలోంచి తొలగించాడు సేఠ్.

ఆరోజు బాగా గుర్తుంది లక్ష్మికి. షాపుకెళ్లింది. షోకేస్‌లో బొమ్మ చేయి విరిగింది. "అతుకులు పెట్టించినా మళ్లీ మళ్లీ ఊడ్తుంది. రిపేరు దండగ. అవతల పారేసి ఈ ముచ్చటైన పాలరాతి రాజస్థానీ బొమ్మని పెట్టండి" అని హుకుం జారీ చేశాడు సేఠ్. కనీసం ఆ పాలరాతి బొమ్మకున్న విలువ ప్రాణాల్తో వున్న మనిషికి లేదు అని అనుకుంది ఉద్యోగం కోల్పోయిన లక్ష్మి. చెడు అలవాట్లు అబ్బిన సీతారాం ఇష్టమొచ్చినప్పుడు వచ్చి పోతుంటాడు. అందుకే మిషనుకుడ్తూ, అప్పడాలు, వడియాలు పెడ్తూ బేబీసిట్టింగ్ పనిచేస్తూ సంసారాన్నీడుస్తోంది లక్ష్మి! సేల్స్‌గర్ల్ పనిపోయిన లక్ష్మి.

"అమ్మా! అమ్మోయ్! పక్కింటమ్మాయి నాకు ఈ పాపబొమ్మనిచ్చిందే. దీని కాలు కాస్త వూడింది. కాస్త కుట్టవూ? నేను ఆడుకుంటా..." పరుగు పరుగున వచ్చిన దీప్తి అరుపుతో ఈ లోకంలోకి వచ్చింది లక్ష్మి. పిచ్చితల్లి! దొరికిన బొమ్మతోనే తృప్తిపడుతోంది. పోనీ మంచిదే" నిట్టూర్చింది. ఆవేళ దీప్తి ఆ బొమ్మకి లాలపోసింది. తన చింకి పాతగౌనుకప్పి జోకొట్టింది. అమ్మ పెట్టిన అటుకులు, పుట్నాల పప్పు, బెల్లం ముక్కని బలవంతంగా తన బొమ్మపాపకి తినిపిస్తూ తన చిన్ని గ్లాసులో మంచినీళ్లు దానికి తాగించింది.

సాయంత్రం వీధిలో పిల్లలంతా ఆడుకుంటున్నారు. తాను కుట్టిన బట్టలిచ్చేసి వచ్చిన డబ్బుతో పాపకి ఏదో ఒక పెద్ద సైజు బొమ్మకొనాలని వెళ్లింది లక్ష్మి.

చేతిలో ఆర్డరిచ్చిన బట్టముక్కలు, ఓ యాభై రూపాయల్తో బైటకొచ్చిన లక్ష్మి బైట పిల్లలంతా గుంపుగా లారీ చుట్టూ వుండడం చూసి ఆగింది. "అత్తా! మరేమో మరే దీప్తి..." పదేళ్ల ప్రవీణ్ ఏం చెప్తున్నాడో ఆమెకి విన్పడడంలేదు. పిచ్చిదానిలా పరుగెత్తిన ఆమె, చేతిలో పాపాయి బొమ్మతో లారీ చక్రాలకిందపడి నలిగిన శరీరంతో ఉన్న దీప్తిని చూస్తూ "అమ్మా... బొమ్మ... పాపాయి బొమ్మ" అని అంటూ హఠాత్తుగా బిగ్గరగా విరగబడి నవ్వసాగింది లక్ష్మి!

◇ ◆ ◇